

సేవాలాల్ ఆలయంలో బోరు మోటార్ ఏర్పాటు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని హాజీపూర్ తండా సమీపంలో గల సేవాలాల్ మహరాజ్ ఆలయంలో బోరు మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యేక నిధులు కేటాయించారని ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. అంతేకాకుండా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయానికి వచ్చే ప్రజలతో పాటు హాజీపూర్ తండా ప్రజలకు సౌతం ఈ బోరుబావి ఎంతో ఉపయోగకరంగా ఉందని స్థానికులు తెలిపారు.

● సదాశివనగర్ మండలం యాచారంలో నిలిచిపోయిన 22వ ప్యాకేజీ సొరంగమార్గం పనులు



ప్యాకేజీ పనులు.. ముందుకు సాగేనా?

- 21, 22వ ప్యాకేజీ పనులకు రూ.22 కోట్ల కేటాయింపు
- భూసేకరణ, కాల్వల తవ్వకాలు, రిజర్వాయర్ నిర్మాణాలకు నిధులు
- రెండువేల ఎకరాలకు గాను... సేకరించిన భూమి వెయ్యి ఎకరాలు మాత్రమే
- యాచారం వద్ద కొనసాగుతున్న సొరంగ మార్గం నిర్మాణ పనులు
- నిధులు లేక 8 ఏళ్లుగా నిలిచిన ప్యాకేజీ పనులు
- పనులు పూర్తయితే 1.56 లక్షల ఎకరాలకు సాగునీరు
- ఇటీవల కాళేశ్వరం ప్యాకేజీ పనులపై సమీక్షించిన ప్రభుత్వం

కామారెడ్డి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్ ప్రాంతాల్లోని రైతాంగానికి సాగునీరు అందించేందుకు చేపడుతున్న కాళేశ్వరం 21, 22వ ప్యాకేజీ పనులకు 8 ఏళ్లుగా నిధులు లేక ముందుకు సాగడం లేదు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్యాకేజీ పనులను చేపట్టేందుకు రూ.22 కోట్ల నిధులను కేటాయించింది. ఈ నిధులైన సకాలంలో విడుదలయి కాళేశ్వరం పనులు ముందుకు సాగుతాయో? లేదో? చూడాలి. ఇటీవల హైదరాబాద్‌లోని జలసౌదాలో 21, 22 ప్యాకేజీ పనులపై ఉమ్మడి జిల్లాల ప్రజాప్రతినిధులతో నీటిపారుదల శాఖ అధికారులతో ఆ శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్షించి పనులకు సంబంధించి నివేదిక కోరారు. పనులు ముందుకు సాగాలంటే కాలువల తవ్వకాలు, రిజర్వాయర్ నిర్మాణం, భూ సేకరణకు రూ.23 కోట్ల నిధులు అవసరమని నివేదించారు. అదేవిధంగా గతంలో కాంట్రాక్టర్‌లు చేపట్టిన పెండింగ్ బిల్లులకు సంబంధించి వివరాలను అందించారు. ఈ పూర్తి నివేదికను మంత్రి ప్రభుత్వానికి సమర్పించారు. దీంతో ప్రభుత్వం ప్యాకేజీ పనులు చేపట్టెందుకు రూ.22 కోట్ల నిధులను కేటాయించింది. ఇక ఈ నిధులతో కాలువ తవ్వకాలతో పాటు రిజర్వాయర్‌ల నిర్మాణం పనులు, భూసేకరణ చేపట్టనున్నారు.

1.56 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

ప్రాణహిత చెవెళ్ల ప్రాజెక్టులో భాగంగా 22వ ప్యాకేజీని కాళేశ్వరం ప్రాజెక్టులో కలుపుతూ తెలంగాణ ప్రభుత్వం రీ డిజైన్ చేసిన విషయం తెలిసిందే. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టులో భాగంగా అప్పటి నిజామాబాద్ ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు 20, 21, 22వ ప్యాకేజీలు రూపొందించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం 22వ ప్యాకేజీని రద్దు చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై ఇష్టనుసారంగా ప్రాజెక్టులను నిర్మించడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నీరు రావడం కష్టమని భావించి ప్రభుత్వం 22 ప్యాకేజీ పనులు చేపట్టిన లాభం లేదని రద్దు చేసింది. తర్వాత పలు ప్రతిపాదనలు రూపొందించి మిడ్‌మానేర్‌నుంచి నీటిని లిఫ్ట్ చేసి అక్కడి నుంచి కామారెడ్డి జిల్లాకు నీటిని తరలించాలన్న ప్రణాళికను ముందుకు తెచ్చారు. ఇది సాధ్యం కాదని తెలడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి పాత డిజైన్ ముందుకు తెచ్చింది. అందులో భాగంగానే 22వ ప్యాకేజీని బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్ చేశారు. ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టులో భాగంగా 22వ ప్యాకేజిని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోకి తీసుకువచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 1.56 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా సంబంధిత అధికారులు ఈ ప్యాకేజీని రీడిజైన్ చేశారు. అంతేకాకుండా జిల్లాలో ఈ ప్యాకేజీ పూర్తయితే కామారెడ్డి నియోజకవర్గంలోని కామారెడ్డి, దోమకొండ, బీబీపేట్, భిక్కనూరు, మాచారెడ్డి, రాజంపేట్ మండలాల్లో 82,200ల ఎకరాలకు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి, సదాశివనగర్, లింగంపేట్, తాడ్వాయి మండలాల్లోని 95,200ల ఎకరాలకు, బాన్సువాడ నియోజకవర్గంలో బాన్సువాడ, నసురుల్లాబాద్, వర్ని మండలాలకు మొత్తం 12 వేల ఎకరాలతో పాటు మెదక్ జిల్లాలో 16 వేల ఎకరాలకు సాగు నీరు అందించేలా రీడిజైన్ చేశారు.

ఇప్పటి వరకు పనులు ఇలా..

కామారెడ్డి, మెదక్ జిల్లాలకు సాగునీరు అందించేందుకు 22వ ప్యాకేజీ పనులను జిల్లాలో చేపడుతున్నారు. సదాశివనగర్ మండలం భూంపల్లి రిజర్వాయర్ నుంచి 100.80 కిలోమీటర్ల మేరకు కాల్వలు తవ్వల్సి ఉంది. ఇందులో ఎడమ కాలువ 51 కిలోమీటర్లు, కుడి కాలువ 11.975 కిలోమీటర్లు, ప్రధాన కాల్వ 14.25 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. ప్రధాన కాలువ(రిడ్జ్‌కాలువ) దాదాపు పనులు పూర్తయ్యాయి. కుడి కాలువ(ఆర్ఎంసీ) తుది దశకు చేరుకుంది. అంతేకాకుండబా ఎడమ కాల్వ (ఎల్ఎంసీ)కు సంబంధించి భూ సేకరణ పనులు కొలిక్కి వచ్చాయి. ఈ కాలువలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని 21వ ప్యాకేజీ నుంచి సోరంగమార్గం ద్వారా భూంపల్లి రిజర్వాయర్ వరకు 7.560 కిలోమీటర్ల వరకు కాలువ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ సొరంగమార్గ పనులు మాత్రం పూర్తికావడం లేదు. ప్రస్తుతం అప్రోచ్ కాలువ తవ్వకం మాత్రమే పూర్తయ్యింది. అలాగే 450 మీటర్ల మేర టన్నెల్ మాత్రమే తవ్వి వదిలేశారు.

నిధులు లేక.. భూ సేకరణ జరగక


జిల్లాలో కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనుల్లో భాగంగా కాలువల నిర్మాణాల కోసం ప్రధానంగా భూ సేకరణ సమస్య ఎదురవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా పలు రిజర్వాయర్‌ల నిర్మాణంతో పాటు కాలువల నిర్మాణానికి 2వేల 921 ఎకరాల భూ సేకరణ కావాల్సి ఉందని ప్రణాళికలో పేర్కోన్నారు. అయితే ఇప్పటి వరకు 1,239 ఎకరాల భూ సేకరణ చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. తాడ్వాయి, సదాశివనగర్, రాజంపేట, రామారెడ్డి మండలాల్లోని పలు గ్రామాల్లో మూడు వందల ఎకరాల భూ సేకరణకు రైతులతో ఒప్పందం పూర్తయ్యాయి. అదేవిధంగా మొత్తం రూ.21.23 కోట్ల నిధులు విడుదలయితే వాటిని రైతుల ఖాతాలో జమచేసి పనులు ప్రారంభించే అవకాశం ఉంది. కాని ఈ నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. మరో ఎనిమిది వందల ఎకరాల భూ సేకరణకు సర్వే పూర్తయ్యింది. రైతులతో ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంది. నిధులు లేని కారణంగా అధికారులు రైతులతో ఒప్పందం చేసుకునేందుకు ముందుకు వెళ్లడం లేదనే వాదన వినిపిస్తోంది.

నత్తనడకన పనులు

జిల్లాలో గత 10 సంవత్సరాల క్రింద మొదలైన కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులు ఇప్పటికి నత్తనడకన సాగుతున్నాయి. సదాశివనగర్ మండలం భూంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తీసుకురావడానికి నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం అమ్రాద్ కోండెం చెరువు నుంచి 1.9 కిలోమీటర్ల మేర అప్రోచ్ కెనాల్ తవ్వాల్సి ఉంది. అందులో భాగంగానే 5.5 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు చేపట్టారు. ప్రస్తుతం అప్రోచ్ కాలువ తవ్వడమే పూర్తయింది. కేవలం 450 మీటర్ల మేర టన్నెల్ తవ్వకాలు జరిపి వదిలేశారు. అదేవిధంగా భూంపల్లి వద్ద 1.5 టీఎంసీలతో నిర్మాణం చేపడుతున్న రిజర్వాయర్ పనులు సైతం పునాదులకే పరిమితమయ్యాయి. ఐదు సంవత్సరాల క్రిందట రిజర్వాయర్ అలుగు నిర్మాణం కోసం పునాదులు తవ్వి బెస్మెట్ వేశారు.భూంపల్లి రిజర్వాయర్ వద్ద సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయడంతో పాటు నిధులు విడుదల చేసింది. ఈ సబ్‌స్టేషన్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగితా పనులన్ని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నమాదిరిగా ఉంది.

రూ.400 కోట్లు అవసరం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాళేశ్వరం పథకం కింద చేపడుతున్న ప్యాకేజీ 21,22 పనులు పూర్తికావాలంటే రూ.400 కోట్లు అవసరమని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. రూ.400 కోట్లు కేటాయించి నిజామాబాద్ జిల్లాలో మంచిప్ప జలాశయం వద్ద భూ సేకరణ సమస్యను పరిష్కరించి ప్యాకేజీ 21, 22వ పనులను అనుసంధానిస్తే సదాశివనగర్ మండలం భూంపల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించవచ్చు. ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తిచేసేందుకు ఇటివల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రజాప్రతి నిధులు, నీటిపారుదల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని జలసౌదాలో సమీక్షించారు. సమీక్ష నిర్వహించి ఎంత మేర నిధులు అవసరమవుతాయో? నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో అధికారులు రూ.400 నుంచి రూ.500ల కోట్ల వరకు కేటాయిస్తే పనులు పూర్తవుతాయని నివేదించారు. ప్రస్తుతానికైతే రూ.23 కోట్ల నిధులను విడుదల చేస్తే కాలువల తవ్వకాలు, భూసేకరణ రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తిచేయవచ్చని నివేదించారు. జిల్లా ప్రజాప్రతినిధులు కోరిక మేరకు ప్రభుత్వం ప్యాకేజీ పనులు చేపట్టేందుకు రూ.22 కోట్లను కేటాయించింది.



ప్రజావాణికి 108 దరఖాస్తులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణిలో 108 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులపై విచారణ త్వరగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం జారీచేసిన కొత్తవెర్షన్‌లో చేపట్టాలని తెలిపారు. సబ్‌కలెక్టర్,ఆర్‌డీఓలు పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగాయని, ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్‌లు పర్యవేక్షించాలని కొన్ని కేంద్రాల్లో ధాన్యం ఉన్నప్పటికీ.. కొనుగోలు చేయడం లేదని అధికారుల దృష్టికి వచ్చిందని తెలిపారు. కొన్ని మండలాల్లో రెండు పడకగదుల ఇళ్ల కేటాయింపునకు లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలని అన్నారు. తహసీల్దార్‌లు ఆన్‌లైన్‌లో ధరణి ఫైల్స్ ఫార్వర్డ్ చేస్తున్నారని మాన్యువల్ ఫైల్స్ పంపించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, ఆర్‌డీఓ వీణ, ఏవో మసూద్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను తీసుకుంటున్న అధికారులు



క్యూలైన్‌లో నిల్చున్న ప్రజలు

భూముల సమస్యలే లక్ష్యంగా భూభారతి

● జిల్లా కలెక్టర్ అశీష్ సాంగ్వాన్ ● పిట్లంలోని రైతు వేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు ● పాల్గొన్న అధికారులు



పిట్లంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అశీష్ సాంగ్వాన్



పాల్కంపేటలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆర్డీవో

పిట్లం ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భూభారతిలో భూముల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ధరణీ స్థానంలో నూతనంగా భూభారతి చట్టానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ అశీష్‌సాంగ్వాన్ అన్నారు. సోమవారం పిట్లంలోని రైతువేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టం ప్రకారం భుముల ఏ సమస్యలను అయినా అధికారులు ఎన్ని రోజులలో పరిష్కరించాలో వివరించారు. భూ సమస్యలు తహసీల్దార్ వద్ద పరిష్కారం కాకుంటే ఆర్డీవో కార్యాలయం, అక్కడ కాకుంటే కలెక్టర్ వద్ద భూసమస్యలు పరిష్కారం సాధ్యం అవుతాయన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను రైతులకు వివరించారు, జిల్లా స్థాయిలో స్థానిక భూసమస్యలు పరిష్కరించేందుకు ఆర్డీఓ, కలెక్టర్‌కు ప్రభుత్వం తరపున అధికారాలు కల్పించారని తెలిపారు. భూసమస్యలు పరిష్కరిస్తు అధికారులు జారీ చేసిన ఉత్వర్వులపై అభ్యంతరాలు ఉంటే భూభారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఇందులో ఉందన్నారు. ఆర్డీవో నిర్ణయం సరైనది కాదని అనిపిస్తే, కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. కలెక్టర్ నిర్ణయంపై అభ్యంతరాలు ఉంటే ట్రిబ్యూనల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ధరణీ పోర్టల్‌లో ఎదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సిన అవసరం ఉండేదని, భూభారతిలో అలాంటి సమస్యలకు పరిష్కారం సాధ్యం అవుతుందన్నారు. భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం ద్వారా నిజమైన భూ యజమానులకు న్యాయం చేకూరుతుందన్నారు. రికార్డ్‌లో మార్పులు, చేర్పులకు సాదా బైనామకు అవకాశం ఉంటుందని తెలిపారు. పిట్లం గ్రామానికి చెందిన పురోహితుడు చంద్రశేఖర్ పోతురెడ్డిపల్లి శివారులో వారసత్వంగా రావడం జరిగిందని, ధరణీలో తమ పేరు మార్చడం జరిగిందని, తమకు న్యాయం చేయాలని కోరారు. పిట్లంకు చెందిన నిరుపేద వ్యక్తి తమకు పింఛన్, సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వివరించారు. ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ప్రత్యేక అధికారి వామన్‌రావ్, ఎంపీడీవో కమలాకర్, ఆర్ఐ శీతల్, రైతులు, మండల అధ్యక్షుడు హన్మాండ్లు, నాయకులు మురళీధర్‌గౌడ్, కుమ్మరి రాములు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: రాష్ట్రంలో నెలకొని ఉన్న భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి పథకాన్ని అమలు చేస్తుందని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంఘ్వాన్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి చట్టంపై నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు ప్రభుత్వం ఎన్నో విధాలుగా ఆలోచించి ధరణిలోని సమస్యలు తొలగించి భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని, దీని వలన ప్రతి ఒక్కరి భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గతంలో ధరణి వలన ఏర్పడిని సమస్యల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, దీని ద్వారా రైతుల సమయం వృధా కావడంతో పాటు డబ్బులు ఖర్చయ్యేవని తెలిపారు. ధరణి ద్వారా నష్టపోయిన రైతులకు ఈ పథకం ద్వారా మేలు కలుగుతుందని పేర్కొన్నారు. గతంలో ధరణి ద్వారా చాలా భూ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ప్రస్తుతం లింగంపేట్ మండలం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఉన్నందున రానున్న రోజుల్లో జిల్లావ్యాప్తంగా రైతుల భూములకు భూఆధార్ కార్డులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్స్‌వాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ దశరథ్, మండల ప్రత్యేక అధికారి కిషన్, ఎంపిడివో లక్ష్మీకాంత్ రెడ్డి,ఏవో కిషన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

లింగంపేట: మే 30వరకు భూ సమస్యలు లేని మండలంగా లింగంపేట మండలాన్ని తీర్చిదిద్దుతామని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని పర్మల్లలో జరిగిన భూ భారతి రెవెన్యూ గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పైలెట్ మండలాలుగా నాలుగు మండలాలను ప్రకటించగా అందులో కామారెడ్డి జిల్లాలోని లింగంపేట మండలం ఒకటని, మండలంలో పూర్తిగా భూ సమస్యలను పరిష్కరించి జూన్ 2న పట్టాలు అందజేస్తామని ఆయన తెలిపారు. కాగా, గ్రామసభల్లో పొల్కంపేటలో 160 దరఖాస్తులు, పర్మల్లలో 165 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ సురేష్, ఆర్ఐ కిరణ్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.

● నేడు భిక్కనూరులో భూభారతి చట్టంపై అవగాహన

భిక్కనూరు: మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ శివప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవగాహన కార్యక్రమానికి మండల ప్రజలు, మేధావులు ముఖ్యంగా రైతులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వారం రోజుల్లో మార్క్‌ఫెడ్ కామారెడ్డికి..

● ఇప్పటికే ఫర్నిచర్‌ను తరలించాం
● ఇకపై కామారెడ్డిలోనే మార్క్‌ఫెడ్ కార్యకలాపాలు
● మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి డీఎం మహేష్‌కుమార్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల మార్క్‌ఫెడ్ కార్యాకలాపాలు నిజామాబాద్‌లో కొనసాగుతున్నందున.. ఇకపై కామారెడ్డికి సంబంధించిన మార్క్‌ఫెడ్ కార్యకలాపాలు ఇక్కడే మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి డీఎం మహేష్‌కుమార్ తెలిపారు. కామారెడ్డి మార్క్‌ఫెడ్‌కు సంబంధించిన సిబ్బందిని, కార్యాలయాన్ని మార్చాలని నిర్ణయించామని అన్నారు. వారం రోజుల్లో కామారెడ్డి కలెక్టరేట్‌లోనే మార్క్‌ఫెడ్ పూర్తి కార్యకలాపాలు కొనసాగుతాయని అన్నారు. సిబ్బందిని సైతం కేటాయించామన్నారు. మార్క్‌ఫెడ్ మాజీ రాష్ట్ర చైర్మన్ ఆదేశాల మేరకు నిజామాబాద్ కలెక్టరేట్ సమీపంలో స్వంతభవనంలోనే ఉమ్మడి జిల్లాల కార్యాకలాపాలను కొనసాగించామన్నారు. ఇకపై కామారెడ్డిలోనే మార్క్‌ఫెడ్‌కు సంబధించి నిర్వహణ ఉంటుందన్నారు.

సబ్జెక్ట్ రిసోర్స్‌పర్సన్‌లు దరఖాస్తు చేసుకోవాలి : డీఈవో

కామారెడ్డిటౌన్‌,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు మండల, జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడానికి సబ్జెక్ట్ రిసోర్స్‌పర్సన్‌లు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాజు తెలిపారు. ప్రాథమిక పాఠశాల విభాగంలో మండల రిసోర్స్‌పర్సన్‌లు మొత్తం 8 ఉండగా.. ఇందులో తెలుగు 2, ఈవీఎస్ 2,ఇంగ్లీష్ 2,మ్యాథ్స్ 2 ఉన్నాయి. డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్‌లు మొత్తం 14 ఉండగా ఇందులో తెలుగు 2, ఈవీఎస్ 2, ఇంగ్లీష్ 2,మ్యాథ్స్2, స్పెషల్ ఎడ్యుకేషన్ 2,ఉర్దు మీడియంకు సంబంధించి ఉర్దు-2,మ్యాథ్స్ 1,ఈవీఎస్ 1 ఉన్నాయి. ఉన్నత పాఠశాల విభాగంలో డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్‌లు 46, హెడ్‌మాస్టర్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్‌లు 8 ఉన్నాయని తెలిపారు. మండల రిసోర్స్‌పర్సన్‌ల కోరకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో, డిస్ట్రిక్ రిసోర్స్‌పర్సన్‌లకు దరఖాస్తు చేసుకునేవారు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా దరఖాస్తుకు ఈ నెల 24 చివరి తేదీ అని తెలిపారు.

కలెక్టర్ సార్.. ఇకనైనా కనికరించండి!

● మెడికల్ కళాశాల ఉద్యోగాల భర్తీ అవకతవకలపై విచారణలో జాప్యం ● అంబేద్కర్‌కు వినతిపత్రం సమర్పించిన బాధితులు, విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలో ఉద్యోగాల భర్తీ అవకతవకలపై విచారణలో జాప్యం చేస్తుండడంతో కలెక్టర్ సార్.. ఇకనైనా కనుకరించండి అంటూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి సోమవారం బాధితులు, విద్యార్థి సంఘ నాయకులు నిరసన తెలిపారు. మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో మ్యాన్‌పవర్ ఏజెన్సీ చేసిన అవకతవకలపై బాధిత అభ్యర్థులతో కలిసి రుజువులతో సహా కలెక్టర్‌ను రెండు, మూడు సార్లు కలిసిన విచారణ చేయిస్తామని చెబుతున్నారే తప్ప బాధితులకు సరైన న్యాయం జరగడం లేదని అన్నారు. గత మూడు రోజుల క్రితం డీఎంఈ డైరెక్టర్‌ను కలిసి ప్రిన్సిపాల్, ఏజెన్సీ నిర్వాహకులపై విచారణ జరపాలని చెబితే కలెక్టర్‌తో మాట్లాడి కమిషన్ వేయిస్తానని చెప్పి ఇంతవరకు ఉలుకుపలుకు లేదని అన్నారు. ఇంకా విచారణలో జాప్యం చేస్తే వేలాది మంది నిరుద్యోగులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు నాగరాజు, వినోద్‌నాయక్, బాధితులు రవి, అరవింద్, సురేష్, సంజయ్, గణేష్, ఫీర్యా, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు, బాధితులు



రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ, ప్రభుత్వ సలహాదారు

సౌకర్యవంతమైన నిర్మాణాలు చేపట్టాలి

● ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా రైల్వేస్టేషన్‌లో నిర్మాణాలు చేపట్టాలని ఎంపీ సురేష్ షెట్కార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఆర్ఎస్ఎస్ స్కీంలో భాగంగా కామారెడ్డి రైల్వే స్టేషన్ మోడల్ రైల్వే స్టేషన్‌గా నిర్మించబడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్థానికుల సౌకర్యం కోసం రెస్టరూంలు, ప్రయాణికుల కోసం క్యాంటీన్ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ప్రయాణికులు రెండో నంబర్ ప్లాట్ ఫారంపై రైలులు ఎక్కువగా నిలుస్తున్నాయని తెలుపుతున్నారని, అదేవిధంగా సాధ్యమైనంత వరకు ఒకటో ఫ్లాట్‌ఫాంపై రైలులు నిలిచేలా చూడాలని అధికారులకు సూచించారు. పాతరాజంపేట వద్ద ఒకటి, కలెక్టర్ కార్యాలయం ముందు నుంచి ఒక ఫ్లైఓవర్ బ్రిడ్జి కోసం ప్రతిపాదనలు పంపించామని త్వరలో పూర్తవుతాయని తెలిపారు. ఇక రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా రైల్వేస్టేషన్ ప్రవేశదారి వెడల్పు పనుల్లో 28 మీటర్లు మాత్రమే వెడల్పు చేయాలని మధ్యలో నుండి 10 మీటర్ల ఎడమవైపు, 14 మీటర్లు కుడివైపు ఉన్న దుకాణాలు మాత్రమే తొలగించాలని సూచించారు. షాపులు పోయిన యాజమానులకు త్వరలో రైల్వే డిపార్ట్‌మెంట్ వారు నిర్మించే దుకాణసముదాయాలు వారికే కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్‌డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



బెల్లాల్‌లో కాలువను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. సోమవారం బెల్లాల్ చెరువు నుండి బోధన్‌కు సరఫరా అయ్యే కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా బెల్లాల్‌లో నీటి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పట్టణంలో తాగునీటి పైపులు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. లీకేజీలు ఉన్నట్లయితే వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. ఆయన వెంట బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, డీఈ యోగేష్, వాటర్ వర్క్స్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

● సొసైటీలో ఎందుకు అమ్ముతున్నారు, బయట అమ్ముకోండి
● సహకార సంఘం క్లర్క్ ఉచిత సలహా



అంబంలో ధర్నా చేస్తున్న గ్రామ రైతులు

ఎడపల్లి, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):వరి ధాన్యం కొనుగోలు చేయాలంటూ సోమవారం అంబం గ్రామ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎడపల్లి మండలంలోని అంబం గ్రామం బోధన్ మండలం పెంటాకలాన్ సహకార సంఘం పరిధిలోకి రావడంతో తమకు ప్రతి ఏటా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వరి పంట కోసి 20 రోజులు అయినా ఇప్పటి వరకు వరి ధాన్యం కొనుగోలు చేయక పెంటాకలాన్ సహకార సంఘం సిబ్బంది నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.బార్దాన్ అడిగితే 50 వంద బస్తాలు ఇస్తున్నారన్నారు. ధాన్యం బస్తాలు నింపి 5 రోజులు అయినా ఇప్పటి వరకు తూకం చేయలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదేమని సహకార సంఘం కార్యదర్శి బాబాను అడగగా తాను ఏమి పట్టించుకోవడం లేదన్నారు. ఏకంగా సహకార సంఘం క్లర్క్ అయితే 'సహకార సంఘం కొనుగోలు కేంద్రాల్లో ఎందుకు అమ్ముతున్నారు, బయట అమ్ముకోండ్రి' అంటూ ఉచిత సలహా ఇస్తూ మేము ఎప్పుడు నింపాలో మాకు తెలుసు మీరు ఎవరికి చెబుతారో చెప్పుకోండ్రి అంటూ రైతులను బెదిరిస్తున్నారని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి అంబం గ్రామ రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ ధర్నాలో రైతులు ఒడ్డెన్న, హరికృష్ణ, లక్ష్మయ్య, సుధాకర్, రమేష్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

గర్భిణీ, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలి

● జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ



మాట్లాడుతున్న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి

నవీపేట,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణీ స్త్రీలు, బాలింతలతో పాటు చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భిణీ స్త్రీలు ఆకుకూరలు, కాయకూరలతో పాటు ఇతర పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకుంటే పుట్టబోయే బిడ్డ మంచి ఆరోగ్యవంతంగా ఉంటారని ఆమె పేర్కొన్నారు. పుట్టిన పిల్లలు వయసు తగ్గ బరువు ఉండే విధంగా చూడాలని అప్పుడే పిల్లలు ఆరోగ్యంతో పాటు మంచి తెలివితేటలతో పెరిగే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని ప్రాథమిక విద్యలో చేరడానికి వెళ్లే చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతం, పలువురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కోటగిరి: గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఆయుర్వేదిక్ వైద్యురాలు రాధిక సూచించారు. పోతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భం దాల్చిన రోజు నుండి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు వెయ్యి రోజులు గోల్డెన్ డేస్ అని పేర్కొన్నారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేశారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, ఎంపీడీవో చందర్, యోగా టీచర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు కల్పన, బాలలక్ష్మి, ప్రియ, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

● రుద్రూరులో పోషణ పక్వాడ

రుద్రూరు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. యునానీ వైద్యధికారి రాఘవేందర్ రావుమాట్లాడుతూ గర్భిణీలకు రక్తహీనత, న్యూట్రిషన్స్ ఆయుష్ రెమడీస్, యోగా ద్వారా లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో శ్రీనివాస్, ఏఎన్ఎం గౌరి శిరీషా తదితరులు పాల్గొన్నారు.

వర్ని: మహిళలు గర్భిణీగా ఉన్నప్పటి నుంచి తల్లీ పుట్టబోయే బిడ్డ వరకు ఆరోగ్య సంరక్షణకు పాటుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి పిలుపునిచ్చారు. సోమవారం వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. థౌజండ్ డేస్, గోల్డెన్ డేస్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎస్‌పీటీఉ జీవన జ్యోతి, సునీత, నిశిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలకు ప్రమాద బీమా పాలసీ

కోటగిరి,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రంలో సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీజేపీ కార్యకర్తలకు ఉచిత ప్రమాద భీమా సౌకర్యాన్ని ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ కల్పించారు. తన సొంత నిధులతో ప్రతి కార్యకర్తకు ప్రమాద భీమా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ కార్యకర్తలకు మనోధైర్యంతో పాటు భరోసా కల్పించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నానన్నారు. పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చిన తనను సంప్రదిస్తే సంబంధిత కుటుంబాలను ఆదుకునేందుకు తనవంతు సాయం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరి నర్సింగ్, రాజు పటేల్, గంగాధర్, సురేష్, నయీమొద్దీన్, నాగనాథ్ పటేల్, శ్రీనివాస్ పటేల్, భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు మహోత్సవానికి తరలి వెళ్లిన నాయకులు

మోర్తాడ్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన రైతు మహోత్సవం వల్ల రైతులు అనేక విషయాలపై ప్రత్యక్షంగా అవగాహన చేసుకుంటారని మండల వ్యవసాయ అధికారి హరీష్ అన్నారు. సోమవారం మండలం నుంచి జిల్లా కేంద్రం లోని జీజీ కాలేజీ గ్రౌండ్‌నందు ఏర్పాటు చేసిన రైతు మహోత్సవానికి మండలం నుంచి రైతులు తరలివెళ్లారు. కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాల్లు , అదునాథన సాంకేతిక పద్దతులు, నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, యంత్ర పరికరాలు తదితర ఉపయోగావంటి ఎన్నో అంశాలు తెలుసుకోవచ్చని అన్నారు. రైతులతో పాటు ఏవో హరీష్, ఏఈవోలు రంజిత్, లక్‌పతి, శ్రీలత, మహేష్ తరలివెళ్లారు.



స్టాల్‌లో పసుపు, జొన్నలను పరిశీలిస్తున్న జాతీయ పసుపుబోర్డు చైర్మన్

● మోర్తాడ్ రైతులు ఏర్పాటు చేసిన కేంద్రీయ పంటల సాగు

మోర్తాడ్:జిల్లాలోని జీజీ కాలేజ్ మైదానంలో జరిగిన మహోత్సవంలో మోర్తాడ్‌కు చెందిన ఆర్గానిక్ మహిళ రైతు లక్ష్మీపటేల్ జొన్న, పసుపు పంటలను కేంద్రీయ పద్ధతిలో పండించి సందర్శకుల కోసం ఏర్పాటు చేసింది. ఎఫ్‌పీవో తరఫున 11వ స్టాల్‌లో పసుపు, జొన్న పంటలను ప్రదర్శించ గా పల్లె గంగారెడ్డి, కార్యదర్శి భవాణీ శ్రీ ఆర్గానిక్ పద్ధతిలో పండించిన పసుపును పరిశీలించారు. పసుపులో కర్‌ప్యూమిన్ పర్సెంట్ బాగుందని అన్నారు. ఈ పసుపును కొనుగోలు చేయడానికి కేరళ నుంచి కొనుగోలు దారులను రప్పిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్గానిక్ ఫార్మస్ లక్ష్మీపటేల్, రైతులు లక్ష్మీనర్సయ్య, ఒల్లెం సంతోష్, టక్కురి మనోజ్, టక్కురి గంగాధర్, వర్ష పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: జిల్లా కేంద్రంలో గిరిరాజ్ కళాశాల మైదానంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న రైతు మహోత్సవం కార్యక్రమానికి కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రత్యేక బస్సుల్లో తరలి వెళ్లారు. కాగా నాయకులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. మండలపార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య కాంగ్రెస్ నాయకులతో పాటు రైతులు రైతుమహోత్స కార్యక్రమానికి తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

సిరికొండ: నిజామాబాద్‌లో జరిగిన రైతు మహోత్సవానికి సిరికొండ నుంచి రైతులు బస్సులో తరలివెళ్లారు. నిజామాబాద్ పట్టణంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో జరిగిన రైతు మహోత్సవానికి మండలానికి చెందిన రైతులు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తరలివెళ్లారు.పెద్దవాల్గోట్,చిన్నావాల్గోట్, రామడుగు, సిరికొండ,మైలారం తదితరగ్రామాలకు చెందిన రైతులు వెళ్లిన వారిలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన బంజ విశ్వనాథ్ (47) జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మైనర్ బాలుడు భానుప్రసాద్ మృతి చెందగా తీవ్ర గాయాలైన బంజ విశ్వనాథ్, కుమారుడు ఓంకార్‌లను పోలీసులు ఆసుపత్రికి తరలించగా ఆర్మూర్ ఆసుపత్రిలో ఓంకార్ మృతి చెందాడు. మెరుగైన చికిత్స కొరకు విశ్వనాథ్‌ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ విశ్వనాథ్ మృతి చెందాడు.

తండ్రి, కొడుకుల అంత్యక్రియలు:పెర్కిట్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి విశ్వనాథ్, కుమారుడు ఓంకార్‌లు మృతి చెందగా కాలనీ ప్రజల రోధనలు మిన్నంటాయి. ఓ వివాహ వేడుకకు వెళ్తున్న తండ్రి, కొడుకు బైక్‌పై రోడ్డు దాటుతుండగా లారీ ఢీ కొట్టడంతో మృత్యుఒడిలోకి పోయారు. దీంతో ఆదివారం సాయంత్రం నుండి రోధనాలు మిన్నంటాయి. తండ్రి విశ్వనాథ్, కొడుకు ఓంకార్‌ల అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు, కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు.

● పలు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శ

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని పలు కుటుంబాల ను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఇటీవల పట్ట ణంలోని హుస్నాబాద్ కాలనీలో గుండెపోటుతో సిద్దాపురం చిన్నరాజేశ్వర్ మృతి చెందారు. పెద్దబజార్‌లో కటికె మస్కట్ గంగారాం అనారోగ్యంతో మృతిచెందారు. అలాగే అశోక్‌నగర్ కు చెందిన బంజ విశ్వనాథ్, కుమా రుడు ఓంకార్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాడ సానుభూతిని తెలిపి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, సర్వసమాజ్ అధ్యక్షుడు కొట్టాల సుమన్, మాజీ కౌన్సిలర్ ఆకుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, కలిగోట ప్రశాంత్, కొడిగెల సుధాకర్, మిర్యాల్‌కర్ కిరణ్, బోడమిది నవీన్ తదితరులు ఉన్నారు.

పోచంపల్లిలో బడిబాట కార్యక్రమం

వేల్పూర్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామంలో సోమవారం అంక్సాపూర్ , పోచంపల్లి పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి వెళ్తి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల సౌకర్యాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా మెరుగైన విద్యబోధన అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్రభుత్వ పరంగా సన్నబియ్యంతో మధ్యహ్న భోజనం, రెండు జతల దుస్తువులు, పాఠ్యపుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ పాఠశాలల్లో 10 తరగతి విద్యార్థులకు ట్రిబుల్ ఐటీలో అడ్మిషన్లు లభిస్తాయని అన్నారు. పోచంపల్లి గ్రామస్థులు పర్యావరణ పరిరక్షణలో ముందున్నారని అదే విధంగా బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం గ్రామ విడిసి ఆధ్వర్యంలో జరుగుతున్న సమావేశంలో ఉపాధ్యాయులు హాజరై ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మల్లీశ్వరి, రఘునాథ్, వినోద్, శ్రీదేవి, శ్రీలక్ష్మీ, యమున తదితరులున్నారు.

నవీపేట: ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండలంలోని నాడాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత కోరారు. సోమవారం బడిబాటలో భాగంగా గ్రామంలో ఉపాధి కూలీ పనులు నిర్వహిస్తున్న తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, నోట్ పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని ఆమె వివరించారు. ఈ



పోచంపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కార్యక్రమంలో రాజు, మల్లేష్, శరత్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

మోపాల్:బయట తిరుగుతున్న బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేర్పించారు. మండలంలోని కంజర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం గ్రామంలోని వీధులగుండా తిరిగి బడికి వెళ్లకుండా బయట తిరుగుతున్న పిల్లలను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో పేదల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలను తప్పకుండా బడిలో చేర్పించాలని కంజర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌చారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌లక్ష్మీ, అరుణశ్రీ, రాణి, గోపాలకృష్ణ, శాంతికిరణ్, ఉమాగౌరీ, భూమయ్య, విజయలక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి



మహిళ సంఘాలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఐకేపీ సీసీ పురస్తు నరేష్ సూచించారు. సోమవారం మండలంలోని పురానిపేట్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు నెలనెల మీటింగ్‌లు పెట్టుకుని ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి తీర్మాణాలు చేసుకోవాలని, శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీవోలు, వివోఏలు, మహిళల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతులకు ఆంధ్రవారు వ్యవసాయం నేర్పించారనడం సరికాదు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రైతులకు వ్యవసా యం చేయడం ఆంధ్రప్రాంతం వారు నేర్పించారని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడడం సరికాదని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. ఆయన అలా మాట్లాడడం యావత్ తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు మహోత్సవ వేడుకలు నిర్వహించడం విడ్డురంగా ఉందన్నారు. నాడు తెలంగాణ ఏర్పాటుకు అడ్డుపడ్డ సమైక్య పాలకుల అడుగులకు మడుగులొత్తిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు సొంత రాష్ట్రంలో ఉన్నామన్న విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. అనేక ఏళ్లక్రితమే దక్కన్ ప్రాంతంలో సన్నబియ్యం పండించిన చరిత్ర తెలంగాణ రైతులదేనన్నారు. వ్యవసాయ రంగంలో నిష్ణాతులైన తెలంగాణ రైతులను అవమానించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తెలంగాణ సమాజానికి బేషర తుగా క్షేమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హుస్నాబాద్ కాల నీలో పలువురు లబ్ధిదారులకు సోమవారం మాజీ కౌన్సిలర్ ఆకుల సంగీత శ్రీనివాస్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్‌లో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కోటగిరి,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని సిద్దాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతశ్రీ విభూషిత జగద్గురు రామానంద చార్య శ్రీ స్వామి నరేంద్ర చార్యజీ ట్రస్టు ద్వారా విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అనిత, సంగీత, జయశ్రీ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు విఠల్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీలత, లలిత తదితరులఉ పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మోర్తాడ్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో కొమిరె సాయిలు (55) సోమవారం వేకువజాములో ఇంటిలో అనుమానాస్పదంగా మరణించారని భీమ్‌గల్ సీఐ పి. సత్యనారాయణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి సమయంలో ఇంటికి మద్యం తాగివచ్చి భార్య వెంకటమ్మ, కూతురు లతలతో గొడవ పడినాడని తెలిపారు. అర్ధరాత్రి 12 గంటలకు మూత్రవిసర్జన కొరకు వెళ్లి మద్యం మత్తులో గోడకు గుద్దుకోగా తల ఎడమవైపుకు గాయం అయ్యిందని భార్య వెంకటమ్మ, కూతురు లత లు అతడిని ఇంటిలో పడుకోబెట్టి ఉదయం 4 గంటలకు లేసి చూసే సరికి సాయిలు చనిపోయాడని సీఐ తెలిపారు. బాలానగర్ గ్రామానికి చెందిన కొమిరె సాయిలు అన్న కొమిరె నడ్పి సాయిలు ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టంకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్సై తెలిపారు.

భార్యనే హత్య చేసింది: ఇదిలా ఉండగా గ్రామస్థుల కథనం మేరకు భర్త సాయిలును వెంకటమ్మ, కూతురు లతలు కలిసి హత్య చేశారని గ్రామస్థులు బహిరంగంగా అంటు న్నారు. గతంలో కూడా కొన్నిసార్లు హత్య ప్రయత్నాలు చేశారని తెలిసింది. గ్రామస్థులు మాత్రం సాయిలుది ముమ్మాటికి హత్యేనని అంటున్నారు.

భూమికోసం మహిళ రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న మహిళలు

మోర్తాడ్,ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): మండలం లోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పులి సుగుణసోమ వారం నుంచి మండల తహసీల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టింది. ఆమెకు మద్దతుగా ఇతర మహిళలు కూడా నిరాహార దీక్షలో పాల్గొన్నారు. సుగుణకు చెందిన సర్వే నంబర్ -12, 13 ఏ, 12,13బి లో గత 40 సంవత్సరాలుగా కబ్జాలో ఉండి పంటలు పండించుకుంటు న్నామని మహిళ తెలిపింది. కాగా అక్రమంగా 0.51, 1-2 గుంటల భూమిని పులిరాజన్న అక్రమంగా చట్టవిరుద్దంగా తమ పాస్‌బుక్కులో ఎక్కించుకు న్నారని మహిళ ఆరోపించింది. ఈ విషయంపై పలు సంవత్సరాలుగా అధికారుల చుట్టు తిరిగిన ఆక్రమించుకున్న భూమిని పంచనామ, ఎంజాయ్ మెంట్ సర్వే యొక్క నకల్ కాపీలు ఇప్పించాలని కోరిన పట్టించుకోలేదని సుగుణ ఆరోపించింది. ఇప్పటికైన మాకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని అప్పటి వరకు రిలే నిరాహార దీక్ష చేపడుతామని బాధితురాలు తెలిపింది.

న్యాయాధికారుల సేవలు విశిష్టమైనవి



బదిలీపై వెళ్తున్న న్యాయాధికారికి మెమొంటో అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):బోధన్ కోర్టులో న్యాయమూర్తులు అందించిన విశిష్ట సేవల గురించి సోమవారం న్యాయవాదులు ప్రశంసలతో కొనియాడారు. సోమవారం బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ న్యాయమూర్తులను సన్మానించారు. బదిలీపై వెళ్తున్న 5వ అదనపు న్యాయాధికారి రవికుమార్, సీనియర్ సివిల్ జడ్జి దేవన్ అజయ్‌కుమార్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్, మొదటి శ్రేణి అదనపు న్యాయమూర్తి సాయిశివ, రెండవ తరగతి స్పెషల్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి, ఉపాధ్యక్షుడు వీఆర్ దేశాయ్, సంయుక్త కార్యదర్శి అక్తర్ పాషా, కోశాధికారి కోటేశ్వర్ రావు, క్రీడ సాంస్కృతిక న్యాయవాది డాక్టర్ సమ్మయ్య, గ్రంథాలయ కార్యదర్శి ఆరీఫోద్దీన్‌లతో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బడుల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు చేయూతనందించాలి



హసాకొత్తూర్‌లో ట్విన్నింగ్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 21: (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దడానికై ఎన్నో సదుపాయాలను, సౌకర్యాలను కల్పిస్తూ అభివృద్ధి పతంలో నడిపిస్తున్నదని. అదేతీరున ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం తమవంతు చేయూతనందివ్వాలని కమ్మర్‌పల్లి మండల విద్యాధికారి ఆంధ్రయ్య అన్నారు. సోమవారం మండలంలోని హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాల సమ్మేళనం అనే ట్విన్నింగ్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, సదుపాయాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. నూతన విద్యా సంవత్సరంలో 5వతరగతి చదివే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే ప్రధాన లక్ష్యంగా ట్విన్నింగ్ అనే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం,యూనిఫామ్‌లు, అందు బాటులో ఉన్నాయని, నాణ్యమై విద్యాబోధన కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లల బంగారుభవిష్యత్తు దృష్ట్యా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తూ బడుల బలోపేతానికి తమవంతు చేయూతనందివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సతీష్, గ్రామంలోని పభుత్వ ఉన్నత, ప్రాథమిక, కమ్మర్‌పల్లి ఉర్దూమీడియం పాఠశాల, మారుతీనగర్ పాఠశాల విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, సతీష్, రిఫామిర్జా, ఉపాధ్యాయులు అంజత్ సుల్తాన్, పసుపుల ప్రసాద్ విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పదోతరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 21:(ఆంధ్రజ్యోతి) మండంలోని కోనాపూర్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు సోమవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమన్ని నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం ద్వార నిర్వహింపబడే పాలిటెక్నిక్ కళాశాలలలో చేరడంద్వార మూడు సంవత్సరాల్లో ఇంజనీరింగ్ విద్యతోపాటు ఆదిపొందేఅవకాశాలు ఉంటాయని, లేదా రెండో సంవత్సరం ఇంజనీరింగ్ కళాశాలలో చేరవచ్చని, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్, కమర్షియల్ ప్రాక్టీస్, ఆటోమొబైల్, మైనింగ్ మెటాలాజికల్, టుక్స్‌టైల్, కెమికల్ మొదలగు కోర్సుల్లో చేరితే తక్కువ సమయంలో ఉపాధి పొందవచ్చనిరారోర్స్ పర్సన్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సన్నదంద కావడానికి హెచ్ఎం రాంప్రసాద్ స్టడీమెటీరియల్ ను విద్యార్థులకు అందజేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):మంజీర సరిహద్దు గ్రామంనుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు.మందర్నా గ్రామం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు.వారి వద్ద ఎటువంటి ప్రభుత్వఅనుమతులు లేవన్నారు.ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు సమయపాలన పాటించి ఇసుక తరలించాలన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న ఉదయం 9గంటల సమయంలో నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ చందన్ కుమార్ సమాచారం ప్రకారం.. కిలో మీటర్ నంబరు 476.1 వద్ద ఘనపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఆత్మహత్యా చేసుకోవాలనే ఉద్దేశ్యంతో గూడ్స్ రైలుకు అడ్డుగా వెళ్లడంతో రైలు ఢీకొని తీవ్రంగా గాయపడగా 108అంబులెన్స్ లో చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు ఆదివారం రాత్రి శ్రీనివాస్ మృతి చెదినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఆయన పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి

ముప్కాల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామానికి చెందిన ఏలేటి గంగాధర్ పురుగుల మందు తాగి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గంగాధర్ గత కొన్ని రోజులుగా మానసికంగా బాధపడేవాడని ఆయనకు కల్లుతాగే అలవాటుందన్నారు. ఇటీవల గ్రామస్థులతో కలిసి తిరుమలకు శ్రీవారి సేవకు వెళ్లాడు. ప్రతీరోజు కల్లుతాగే అలవాటున్న ఆయనకు అక్కడ కల్లు లభించకపోవడంతో ఇటీవల స్వగ్రామానికి చేరుకొని మానసిక ఆందోళనకు గురై పురుగుల మందుతాగగా ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రైయివేట్ ఆసుపత్రికి తరలించారు.అక్కడచికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారన్నారు. మృతుని భార్యఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిధర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బోధన్‌రూరల్,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రైల్వేగేటు దగ్గర సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితి పడిపోతే స్థానికుల సమాచారం మేరకు బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించగా అతడు మృతి చెందాడని వైద్యులు చెప్పారని పేర్కొన్నారు. అతడి చేతిపై జైహనుమాన్, రమేష్ అని రాసి ఉందన్నారు. ఎవరైనా వివరాలు తెలిస్తే బోధన్ పోలీసులకు సమాచారం తెలియజేయాలన్నారు. మృతదేహం జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో ఉందన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

ఆలూర్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం గగ్గుపల్లి గ్రామంలో ఎంపీడీవో గంగాధర్ పర్యటించడం జరిగింది. ఇందులో భాగంగా సానిటేషన్ పనులు, తాగునీటికి సంబంధించిన పనులను పరిశీలించారు. వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇలాంటి సమయంలో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి కిషోర్‌కు ఆదేశించారు.



గిరిరాజ్ కళాశాల గ్రౌండ్‌లో ల్యాండ్ అవుతున్న హెలిక్యాప్టర్

అధికారుల సమన్వయలోపం

- గిరిరాజ్ కళాశాల గ్రౌండ్‌లో ల్యాండ్ అయిన హెలిక్యాప్టర్
- కూలిన రైతు మహోత్సవం స్వాగత తోరణం
- హెలిక్యాప్టర్ గాలి తాకిడికి ఇబ్బందులు పడ్డ స్టాళ్ల నిర్వాహకులు

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతు మహోత్సవ కార్యక్రమం సందర్భంగా జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో అకస్మాత్తుగా మంత్రులు ప్రయాణిస్తున్న హెలిక్యాప్టర్ ల్యాండ్ కావడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. జిల్లా కలెక్టరేట్‌లో ల్యాండ్ కావాల్సిన హెలిక్యాప్టర్ సమన్వ య లోపం కారణంగా రైతుమహోత్సవ కార్యక్రమం జరుగుతున్న గిరిరాజ్ కళాశాల మైదానంలో ల్యాండ్ కావడంతో హెలిక్యాప్టర్ తాకిడికి రైతు మహోత్సవ స్వాగత తోరణంతో పాటు పలు స్టాల్స్ పడిపోయాయి. పోలీసులు తనిఖీలు చేస్తున్న సామగ్రితో పాటు స్వాగత తోరణం ఒక్కసారిగా కిందపడటంతో అక్కడే ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. జిల్లా అధికారులంతా కలెక్టరేట్‌లో మంత్రులకు స్వాగతం పలికేందుకు వేచి చూస్తూ మంత్రుల కాన్వాయి సైతం అక్కడే ఉండగా వారికి సమాచారం లేకుండానే హెలిక్యాప్టర్‌ను గిరిరాజ్ కళాశాలలో దింపడంతో రైతులు, అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు లేకుండా హెలిక్యాప్టర్ దించడంతో దుమ్మూధూళితో రైతులు, అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి సమాచారం లేకుండా అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే హెలిక్యాప్టర్ గిరిరాజ్ కళాశాల మైదానంలో దిగినట్లు తెలుస్తోంది. తర్వాత హెలిక్యాప్టర్‌ను కలెక్టరేట్ హెలి ప్యాడ్‌కు తీసుకువెళ్లి తిరుగు ప్రయాణంలో మంత్రులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



హెలిక్యాప్టర్ తాకిడికి పరుగులు పెడుతున్న అధికారులు, సిబ్బంది



రైతు మహోత్సవంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన రైతులు



చెరకు వంగడాలను వివరిస్తున్న ప్రతినిధులు



వరి వంగడాలను వివరిస్తున్న జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రతినిధులు

ఆకట్టుకున్న స్టాళ్ల ప్రదర్శన

- కొత్త వంగడాలు, అధునాతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ రైతు మహోత్సవంలో వివిధ వ్యవసాయ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు, వివిధ కంపెనీల ప్రతినిధులు నూతన వ్యవసాయ పద్ధతులు, యంత్రాల ద్వారా వ్యవసాయం, నూతన వంగడాలు, డ్రిప్ ఇరిగేషన్, కోళ్లు, మేకల పెంపకం, తదితర వివరాలను రైతులకు వివరించేందుకు వివిధ స్టాళ్లను ఏర్పాటు చేశారు. మొదటిరోజు రైతులు స్టాళ్ల వద్దకు వెళ్లి నూతన వ్యవసాయ పద్ధతుల గురించి వివరంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యమ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. చెరకు వంగడాలు చెరకు ద్వారా ఉత్పత్తి అయ్యే పదార్థాలను ప్రదర్శించారు. మొలాసిస్, పంచదారా, ఇథనాల్, స్పిరిట్, తదితర పదార్థాలను చెరకు ద్వారా ఎలా తయారు చేసుకోవాలో అదే విధంగా చెరకులో అంతర్‌పంటలు మొక్క మొదళ్లలో మట్టి ఎగదోలుట, చెరకు ఆకు రెలచి నేలమీద కప్పుట, జడ చుట్టు వేయుట, చెరకు నరుకు యంత్రం తదితర వివరాలను రైతులకు వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో అధిక దిగుబడి మరియు రాబడికి ఏఏ వంగడాలను వాడాలో వివరించారు. జగిత్యాల వరి అదేవిధంగా, నూతన సాంకేతిక పరిజ్ఞానం, స్వయం ఉపాధి, పసుపు విస్తీర్ణం, పసుపు రకాలు, తదితర వివరాలను స్టాల్స్ ద్వారా వివరించాయి. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కలిగే లాభాలను ఉద్యానవన శాఖ ద్వారా అందిస్తున్న రాయితీలను వివరిస్తూ ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ, జైన్ ఇరిగేషన్ సిస్టమ్ ఆధ్వర్యంలో స్టాల్స్ ప్రదర్శన ద్వారా రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులను వివరించారు. అదేవిధంగా ఆయిల్‌పామ్ ద్వారా కలిగే లాభాలను ఆయిల్ పామ్ ద్వారా ఉత్పత్తి అయ్యే పదార్థాలను ప్రదర్శించారు. ఆధునిక యంత్రాలతో పాటు యంత్రాలకు గల సబ్సిడీని వివరిస్తూ స్టాల్స్ ప్రదర్శన చేశారు. కామారెడ్డి పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, కాలేజీ ఆఫ్ డైరీ టెక్నాలజీ ఆధ్వర్యంలో బట్టర్, పన్నార్, లస్సీ, తదితర ఆహార పదార్థాలను ఏవిధంగా తయారు చేస్తారో వివరించారు.



డ్రిప్ ఇరిగేషన్ గురించి వివరిస్తున్న అధికారులు



పామాయిల్ పంట గురించి వివరిస్తున్న ప్రతినిధులు



యంత్రాల ప్రదర్శన



పన్నీర్, లస్సీ, బట్టర్ తయారీని వివరిస్తున్న పీవీనర్సింహారావు వెటర్నరీ, డెయిరీ టెక్నాలజీ విద్యార్థులు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన మానిటరింగ్ అధికారి



ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న అధికారి

లింగంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మానిటరింగ్ అధికారి రాధిక తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఏర్పాటుచేసిన వసతులపై ఆమె రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో టెంట్‌తోపాటు, మంచి నీరు, విద్యుత్, 10 వరకు టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచినట్లు రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అసౌకర్యం లేదని తెలిపారు. ధాన్యం తూకం వేయడం వేగవంతం చేయాలని రైతులు కోరారు. దీంతో ఆమె తూకం వేగవంతం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ దేవెందర్‌రెడ్డిని కోరారు. గన్నీ బ్యాగులు సైతం కావాల్సినన్ని అందుబాటులో ఉన్నాయని 10 రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని చైర్మన్ పేర్కొన్నారు. ఆమెవెంట చైర్మన్ దేవెందర్‌రెడ్డి, సీఈవో పెంటయ్య, సిబ్బంది పురుషోత్తమ్, దుర్గ ప్రసాద్‌లతో పాటు రైతులు సల్ల మల్లయ్య. రాములు, రైతులు ఉన్నారు.

ఫొటో న్యూస్



ఆకులు రాలి మొడుగా రావిచెట్టు



రెండోవారం కాయలతో..

ఒక్కో వారం ఒక్కో రూపం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని రావి చెట్టు చూపరులకు ఆకర్శిస్తోంది. ఆకురాలే సమయంలో చెట్టుకున్న ఆకులన్నీ రాలి పోయి ఎండిన మోడును తలపించిన చెట్టు ఒక్కో వారం ఒక్కో రూపం దాల్చుతోంది. తొలిసారి చెట్టుకు కాయల లాంటివి కనిపించగా.. రెండో వారం లేతాకులు దర్శనమిచ్చాయి. మూడోవారం బంగారు వర్ణంతో చెట్టు కళకళలాడింది. తదుపరి వారం ఆకుపచ్చ వర్ణంతో ఆకులు పెరిగి ప్రస్తుతం వేసవిలో ఎంతో మందికి నీడనిస్తోంది.



మూడో వారం లేత ఆకులతో..



నాల్గోవారం నిండుగా నీడనిస్తూ..

చలువ పందిళ్లే బస్టాండ్‌లు!

- భిక్కనూరులోని జాతీయ రహదారిపై ఎండకు, వానకు ప్రయాణికులకు అవే ఆధారం
- బస్టాండ్‌లు లేక చలువ పందిళ్లను ఏర్పాటు చేసిన యువకులు
- ప్రజలకు ఉపయోగపడే స్థలంలో ప్రయాణ ప్రాంగణాలను నిర్మించాలని కోరుతున్న గ్రామ ప్రజలు

జర దేఖో!!



బస్వాపూర్ వద్ద చలువ పందిరి ఏర్పాటు చేసిన దృశ్యం



సిద్దరామేశ్వరనగర్ వద్ద ఇలా..

భిక్కనూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామాలకు చలువ పందిళ్లే బస్టాండ్‌లు. ఎండైనా, వానైనా ప్రయాణికులకు అవే ఆధారం. 44వ జాతీయరహదారిని ఆనుకుని ఉన్న భిక్కనూరు మండలంలోని సిద్దరామేశ్వర నగర్ గ్రామాల్లో బస్టాండ్‌లు లేక ఆయా గ్రామాల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దింతో చేసేదేమి లేక ఎండైనా, వానైనా రోడ్డుపైనే బస్సుల కోసం నిలబడాల్సి పరిస్థితి నెలకొంది. ఇటీవల ఆయా గ్రామాల యువకులు వారి గ్రామస్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి వారే ఆయాగ్రామాల వద్ద చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలకు చెందిన మరికొందరు సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. బస్టాండ్‌లు లేకపోవడంతో రోడ్లపై బస్సుల కోసం ప్రయాణీకులు నిలబడుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రిసమయంలో బస్సుల కోసం రోడ్డుపై నిలబడటంతో భద్రత సమస్యలు తలెత్తుతున్నాయి. రోడ్డుపై బస్సులు నిలపడానికి సైతం స్థలం అనువుగా లేకపోవడంతో బస్సు డ్రైవర్లు సైతం అక్కడా బస్సులను ఆపడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ కానీ సంబంధిత అధికారులు కానీ పట్టించుకుని ఆయాగ్రామాల్లో సర్వీస్‌రోడ్లను, బస్టాండ్‌లను నిర్మించాలని ఆయాగ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

ఏ కాలమైనా ప్రయాణికులకు ఇబ్బందులే..

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బస్వాపూర్ గ్రామంలో కామారెడ్డివైపు, సిద్దరామేశ్వరనగర్‌లో రెండువైపుల ఆయా గ్రామాల యువకులు ఈ చలువ పందిర్లను ఏర్పాటుచేశారు. సిద్దరామేశ్వర నగర్ గ్రామంలో ఆశుశ్రీ యూట్యూబ్ చానెల్ ప్రతినిధులు, బస్వాపూర్ గ్రామంలో యూత్ ఫర్ యూనిటీ ప్రతినిధులు ఈ చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రజలకు ఎండకు, వానకు ఈ చలవ పందిర్లే ఆధారమయ్యాయి. తాము బస్టాండ్‌లు లేక ఇంత ఇబ్బందులు ఎదుర్కోంటున్న ఎవరు పట్టించుకోవడం లేదని ఆయాగ్రామాల ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండ్‌లు నిర్మించాలని వినతులు

44వ జాతియ రహదారిని డబుల్ రోడ్డుగా నిర్మించే సమయంలో సిద్దరామేశ్వరనగర్ వద్ద కాకుండా పెద్దమల్లారెడ్డి ఎక్స్ రోడ్డు వద్ద ఇరువైపులా బస్టాండ్‌లను, బ్రిడ్జిని, సర్వీస్‌రోడ్డును నిర్మించారు. అక్కడ నిర్మించిన బస్టాండ్‌లు ఈ గ్రామస్థులకు దాదాపు కిలోమీటరు దూరంలో ఉండటంతో ప్రస్తుతం ఆ బస్టాండ్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామస్థులకు అందుబాటులో ఈ బస్టాండ్‌లు లేకపోవడంతో ఈ గ్రామప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో కామారెడ్డి వైపు జాతీయ రహదారిని ఆనుకుని సర్వీస్‌రోడ్డు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో ఈ వైపు బస్టాండ్‌ను నిర్మించలేదు. ఈ విషయమై జీఎంఆర్, ఎన్‌హెచ్ఏఐ అధికారులకు మాజీ ఎమ్మెల్యే గంపగోవర్దన్, ప్రస్తుత ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఆయాగ్రామాల ప్రజలు ఎన్నిసార్లు విన్నవించిన సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయాగ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా బస్టాండ్‌లను నిర్మించడంతో పాటుగా ఆయా సౌకర్యాలను కల్పించాలని ఆయాగ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

జొన్నరొట్టెతో ఆరోగ్యం పదిలం

- వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధం
- ఇష్టంగా తింటున్న ప్రజలు
- రొట్టెల తయారీతో మహిళలకు ఉపాధి

బాన్సువాడటౌన్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): జొన్నరొట్టెతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మన పూర్వీకుల నుంచి వస్తున్న నమ్మకం. ఒకపుడు ఇది కేవలం పేదల ఆహారంగా ఉండేది. అందరూ అన్నం తినడం అలవాటు చేసుకోవడంతో క్రమేనా జొన్నరొట్టెల వినియోగం తగ్గింది. కొంతమ ంది చాలా సంవత్సరాలుగా అన్నానికి బదులుగా జొన్నరొట్టెను తినడంతో వారు ఆరోగ్యంగా ఉంటున్నారు. ప్రస్తుతం అందరూ కూడా జంక్ ఫుడ్ తినడానికి అలవాటు పడుతున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. నాసిరకమైన నూనెలు, రసాయనాలు కలిపిన వంట పదార్థాలను తిని ప్రజలు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. మారుతున్న కాలం, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రజలు తిరిగి సంప్రదాయ ఆహారం తినడానికి ఆసక్తి చూపుతున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం జొన్నరొట్టెలు తింటూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నారు.

వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధం

జొన్నరొట్టె వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధంలా పని చేస్తోంది. పోషకాలు సమృద్ధిగా కలిగిన ఆహారంగా జొన్నరొట్టె ప్రత్యేకత. మధుమేహం ఉన్నవారికి ఇది చక్కని భోజనం. 100 గ్రాముల జొన్నలో 10.4 గ్రాముల ప్రోటీన్లు ఉంటాయి. మానవ శరీరానికి ప్రతీ రోజు అవసరమైన



ఫైబర్ జొన్నరొట్టె అందిస్తుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. జొన్నలో ఐరన్, కాల్షియం, విటమిన్ బీ, మినరల్స్ వంటివి ఉన్నాయి. జొన్నరొట్టె తినడంతో బరువు తగ్గడం, జీర్ణక్రియ మెరుగు పడడం, గ్యాస్ వంటి సమస్యలకు చెక్‌పెట్టవచ్చు.

ఉపాధి పొందుతున్న మహిళలు

జొన్నరొట్టెల తయారీతో మహిళలు ఉపాధి పొందుతున్నారు. బాన్సువాడ పట్టణంలో సాయంత్రం సుమారు 8 దుకాణాలలో మహిళలు జొన్నరొట్టెలను తయారు చేసివి క్రయిస్తారు. ఇళ్లలో, బండిపై, దుకాణాలలో మహిళలు ప్రతీ రోజు ఒక్కొక్కరు 50కి పైగా జొన్నరొట్టెలను తయారు చేస్తారు. ఒక్క జొన్నరొట్టె 15 రూపాయలకు విక్రయిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. మొత్తానికి జొన్నరొట్టె అటు ఆరోగ్యం, ఇటు ఉపాధి కల్పిస్తోంది.



గాంధీనగర్ వద్ద ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం మహిళల రాస్తారోకో

లింగంపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీనగర్ వద్ద సోమవారం తాగునీటి కోసం మహిళలు ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై రాస్తారోకో చేశారు. గ్రామంలో ఉన్న బోరు మోటరు చెడిపోవడంతో పాటు భూగర్భ జలాలు పూర్తిగా ఇంకి పోవడంతో నీటి కట కట ఏర్పడిందని వారం రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎంపీడీవో నరేష్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి తాగునీటిని అందజేశారు. మిషన్ భగీరథ నీటి పైపులైన్ బాగు చేసి నీరు వచ్చేలా చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై అధికారుల విచారణ

భిక్కనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అసెస్మెంట్ జారీ, అక్రమ రిజిస్ట్రేషన్‌పై పంచాయతీ అధికారులు, ఏసీబీ అధికారులు విచారణ చేపట్టిన సంఘటన మండలకేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్లితే.. గ్రామానికి చెందిన బోగరి నిదార్కర్ హామోషరావు తన కుమారుడు సతీష్‌కుమార్, స్వాతిపేరుపై గ్రామ పంచాయతీ అధికారికి ఎలాంటి సంబంధం లేకుండా 883, 3249 అసెస్మెంట్ జారీ కాగా.. ఆ నెంబర్లతో దోమకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయ్యింది. ఈ అసెస్మెంట్‌ల జారీకి సంబంధించి ఈ పంచాయతీ వెబ్‌సైట్‌లో నమోదు కాగా గ్రామపంచాయతీ రికార్డుల్లో మాత్రం వాటికి సంబంధించిన వివరాలు లేవు. దీంతో ఫిర్యాదు అందుకున్న జిల్లా అధికారులు, ఏసీబీ అధికారులు గత శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటుగా ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ విషయమై గ్రామ పంచాయతీ ఈవో మహేష్‌గౌడ్‌ను వివరణ కోరగా అక్రమంగా జారీ అయిన అసెస్మెంట్‌లపై డీఎల్పీవో, ఏసీబీ అధికారులు విచారణకు వచ్చినట్లు ఆయన తెలిపారు.

'సన్న బియ్యంపై అపోహలు వద్దు'

రామారెడ్డి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యంపై వస్తున్న అపోహలను నమ్మవద్దని సోమవారం రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్ అన్నారు. రామారెడ్డి మండలం మద్దికుంట దళితవాడలో గిరి లక్ష్మి ఇంట్లో ప్రభుత్వ సన్న బియ్యంతో చేసిన వంటతో భోజనం చేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

లింగంపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మానిటరింగ్ అధికారి రాధిక తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులపై ఆమె రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో టెంట్‌తో పాటు, మంచినీరు, విద్యుత్, 10వరకు టార్పిన్లను రైతులకు అందుబాటులో ఉంచినట్లు రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అసౌకర్యం లేదని వారు తెలియజేశారు. ధాన్యం తూకం వేయడం వేగవంతం చేయాలని రైతులు కోరారు. దీంతో ఆమె తూకం వేగవంతం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డిని కోరారు. గన్ని బ్యాగులు సైతం కావల్సినన్ని అందుబాటులో ఉన్నాయని 10 రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని చైర్మన్ తెలిపారు. ఆమె వెంట చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సీఈవో పెంటయ్య, సిబ్బంది పురుషోత్తమ్, దుర్గప్రసాద్, రైతులు సల్ల మల్లయ్య. రాములు ఉన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

తాడ్వాయి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మాజీవాడి గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.5 లక్షల సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకంటి వెంకటరెడ్డి తెలిపారు. సీసీ రోడ్డు నిధులను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో అధికార ప్రతినిధి మహ్మద్ షౌకత్ అలీ, గ్రామ అధ్యక్షుడు రాజేందర్‌రావు, బలవంతరావు, రమేష్‌రావు, రవీందర్ రావు, అఖిల్ రావు, రాజీవ్ కుమార్, సుధాకర్‌రావు, తదితరులున్నారు.

రూ.35 వేలకు మామిడి తోట వేలం

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్తుమ్మెద ప్రభుత్వ ఉద్యాన వన క్షేత్రంలో మామిడి తోటకు సోమవారం ఉద్యాన క్షేత్రంలో ఉద్యాన వన క్షేత్ర అధికారి కమలాకర్ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యాపారులు వేలంపాటలో పాల్గొనగా అందులో మండలంలోని గోలి లింగాల్ గ్రామానికి చెందిన గంగారం అందరికంటే అధికంగా రూ.35 వేలు వేలం పాట పాడి మామిడి తోటను కైవసం చేసుకున్నారు. ఈ ఉద్యానవన క్షేత్రంలో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో వివిధ మేలు రకాలకు చెందిన 250 వరకు మామిడి చెట్లు ఉన్నాయి. ఈసారి వాతావరణ పరిస్థితుల దృశ్య క్షేత్రంలోని కేవలం 50 మామిడి చెట్లు మాత్రమే నామమాత్రంగా మామిడి కాత కాసాయి. దీంతో ఈసారి మామిడి తోట వేలం పాటలో పాల్గొనేందుకు వ్యాపారస్తులు ఆసక్తి కనబర్చలేదు. ఈ క్షేత్రంలో శనివారం మామిడి తోటకు అధికారులు వేలం పాట నిర్వహించగా నలుగురు మాత్రమే వేలంపాటలో పాల్గొని 20 వేల రూపాయలు వరకే వేలం పాటను పాడారు. దీంతో నిర్దేశించిన వేలం ధర రాకపోవడంతో వేలం పాటను అధికారులు వాయిదా వేశారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులుపాఠశాల స్థాయిలోనే బాగా చదివి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని మండల విద్యాధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల స్థాయి అనేది విద్యార్థులకు పునాదిలాంటిదని, ఈ సమయంలో చక్కగా విద్యాభ్యాసం చేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఎండలు

● జిల్లాలోని బిచ్కుందలో 44 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదు ● ఎండల తీవ్రతతో ప్రజలకు తప్పని తిప్పలు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండల తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనిలో భాగంగా ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. ప్రస్తుతం 43 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కాగా, గడిచిన 24 గంటల్లో జిల్లాలో 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని బిచ్కుంద మండలంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత, పిట్లం 43.8, బాన్సువాడ మండలం కోల్లూర్‌లో 43.7, రామారెడ్డి 43.6, నిజాంసాగర్ మండలం హసన్‌పల్లి 43.5, మద్నూర్ మండలం సోమూర్‌లో, మేనూరులో, జుక్కల్‌లో 43.4, నస్రూళ్లబాద్‌లో 43.3, గాంధారి మండలం సర్వాపూర్‌లో 43.0, డొంగ్లిలో 42.7, డొంగ్లి 42.7, పాతరాజంపేట, పాల్వంచ మండలం ఎల్పుగొండ 42.6, బీర్కూర్ 42.4, పెద్దకొడప్‌గల్, సదాశివనగర్ 42.3, కామారెడ్డి ఐడీవోసీ, మాచారెడ్డి మండలం లచ్చపేట, రాజంపేట మండలం ఆర్గొండ 42.0, నాగిరెడ్డిపేట, 41.9, నస్రూళ్లబాద్ మండలం బొమ్మన్ దేవునిపల్లి, ఎల్లారెడ్డి మండలం మాచాపూర్, తాడ్వాయి 41.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని దాదాపు 31 ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల పైనే నమోదు కావడం గమనార్హం.





ఎండల తీవ్రతతో అంతంతమాత్రంగానే ప్రయాణాలు సాగిస్తున్న ప్రజలు



సౌత్‌క్యాంపస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్



వినతిపత్రాన్ని అందజేస్తున్న అధ్యాపకులు

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణా రెడ్డి ● భిక్కనూరులోని సౌత్ క్యాంపస్ సందర్శన ● విద్యార్థులతో మాటామంతీ

భిక్కనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకుసాగాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపస్ పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పట్టణ ప్రాంత విద్యార్థుల కంటే గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన విద్యార్థులకు పట్టుదల, చురుకుదనం ఎక్కువ అని అన్నారు. సముద్రం నుండి ఆకాశం వరకు అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకుని ఉన్నతస్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. క్యాంపస్‌లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం బాలికల హాస్టల్‌ను పరిశీలించి వారితో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● చైర్మన్‌కు కాంట్రాక్ట్ అధ్యాపకుల వినతి

భిక్కనూరు: తమ సమస్యలను పరిష్కంచేవిధంగా కృషిచేయాలని కోరుతూ మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ కాంట్రాక్ట్ అధ్యాపకులు సోమవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు కాంట్రాక్టు అధ్యాపకులు మాట్లాడుతూ గత చాలా సంవత్సరాలుగా యూనివర్సిటీల్లో 1100 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్నారని, వారందరికి ఉద్యోగ భద్రత కల్పించిన అనంతరమే నూతన నియామకాలను చేపట్టాలని, అందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కోరారు.

జిల్లాలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టేలా చర్యలు

● జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టేలా తగు చర్యలు చేపడుతున్నట్టు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఆయన సోమవారం నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నేరాల సంఖ్యను తగ్గించేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణ కు తగు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని రోడ్డు ప్రమాదాల వల్ల చాలామంది ప్రాణాలను కోల్పోతున్నట్లు తెలిపారు. గత 3 సంవత్సరాలలో రోడ్డు ప్రమాదాల వల్ల జిల్లాలో 270 మంది వరకు ప్రాణాలు కోల్పోయినట్టు, ప్రస్తుతం నాలుగు నెలల వ్యవధిలో రోడ్డు ప్రమాదాలు జరిగి 70 మంది మృతిచెందినట్టు తెలిపారు. అధిక వడ్డీ వ్యాపారులపై నిఘా పెట్టామని జిల్లాలో 63 మంది అధిక వడ్డీ వ్యాపారులను విచారణ జరిపి 19 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఆత్మహత్య కేసులు కూడా అత్యధికంగా నమోదవుతున్నాయన్నారు. కల్తీ కల్లు త్రాగి ప్రజలు అనారోగ్యం పాడిన పడుతున్నారని, కల్తీ కల్లు, మత్తు పదార్థాల పైన ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎస్పీ వెంట ఎల్లారెడ్డి డిఎస్పీ శ్రీనివాస్ రావు, స్థానిక ఎస్సై మల్లారెడ్డి ఉన్నారు.

లింగంపేట: జిల్లాలో మత్తు పదార్థాలు విక్రయించిన, కలిగి ఉన్నా కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర అన్నారు. ఆయన సోమవారం లింగంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్లులో కలిపే మత్తు పదార్థం అల్ఫాజోలం కారణంగా నసరుల్లాబాద్‌లో అనేక మంది అస్వస్థకు గురయ్యారని దీని కారణంగా నసరుల్లాబాద్‌లో కల్లుదుకాణం మూసి వేసినట్లు ఆయన తెలియజేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్సై వెంకట్‌రావు, ఏఎస్సై ప్రకాశ్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.



లింగంపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

'ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులను త్వరగా జమ చేయాలి'

భిక్కనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు త్వరగా వారి ఖాతాల్లో డబ్బులను జమ చేయాలని టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి, బస్వాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం వద్ద రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ చేసి రైతుల ఖాతాలో డబ్బులను త్వరగా జమ చేయాలని ఆదేశించారు. ఇందులో టాస్క్‌ఫోర్స్ సీఐలు అజయ్‌బాబు, లక్ష్మయ్య, ఎస్సై శ్రీనివాస్‌రావు, ఏఎస్‌వో సుదర్శన్‌రెడ్డి, డీటీ కిష్టయ్య, ఆయా విండోల చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, విండో డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళోజి వాడి గ్రామంలో ఉరి వేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు తాడ్వాయి ఎస్సై రాజయ్య తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మల్లమారి శివరాజు కాళోజి వాడి గ్రామం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతని కొడుకు మల్ల మరి రాకేష్ (25) కు ఐదు సంవత్సరాల కింద పోసానిపేట గ్రామానికి చెందిన సంధ్యతో వివాహమైంది. వారికి ఒక కుమారుడు అనుష్(3) ఉన్నాడు. గత రెండు సంవత్సరాల క్రితం నుంచి భార్యాభర్తల మధ్య సంసార విషయంలో గొడవలు జరిగేవి. నెల క్రితం కాముని పండుగ రోజు సంసార విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రాకేష్ తీవ్ర మనస్థాపంతో బాధపడుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు కాలోజీ వాడి శివారులోని తన వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరివేసుకొని చనిపోయినాడు. ఈ మేరకు ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

బీర్కూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి అనిల్ అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన సింగని అనిల్(37) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం అనిల్ ఒక పని నిమిత్తం బీర్కూర్ నుంచి బాన్సువాడకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ క్రమంలో దామరంచ గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో అనిల్ కింద పడ్డాడు. తలకు బలమైన గాయలై తీవ్ర రక్తస్రావం జరిగింది. స్థానికులు గమనించి వెంటనే 108లో బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో నిజామాబాద్‌కు రీఫర్ చేశారు. నిజామాబాద్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లల ఉన్నారు. మృతుడి భార్య, ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో మరొకరు..

నిజాంసాగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ వ్యక్తి శవాన్ని పోలీసులు సోమవారం వెలికి తీశారు. తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు బోధన్ పట్టణంలోని శేఖర్‌నగర్‌కు చెందిన అబ్దుల్ సలాం(37) ఆదివారం నిజాంసాగర్ వచ్చి ఆత్మహత్యకు పాల్పడి ఉన్నాడని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ శవాన్ని వెలికి తీసి పంచానామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అబ్దుల్ సలాం ఎందుకు ఇలాంటి ఆత్మహత్యకు పాల్పడ్డాడు అనేది అంతు చిక్కడం లేదు. అబ్దుల్ సలాం మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● కామారెడ్డిలో గుర్తుతెలియని వ్యక్తి..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని దర్శన్‌టాకీస్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని మృతదేహన్ని కామారెడ్డి పోస్టుమార్టం రూమ్‌లో భద్రపరిచినట్లు తెలిపారు.

చెరువులో పడి వృద్ధురాలి దుర్మరణం

మాచారెడ్డి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసాయిపేట గ్రామానికి చెందిన కోలాపూరం లక్ష్మి(62) చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. లక్ష్మికి మతిస్థిమితం సరిగా లేదని ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి గ్రామ శివారులోని చెరువులో దూకి మరణించిందని తెలిపారు. లక్ష్మి పెద్దకొడుకు నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

టేకు చెట్లు నరికిన ఒకరిపై కేసు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా టేకు చెట్లు నరికించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి అటవీ శాఖ రేంజ్ అధికారి ఓంకార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో అనుమతి లేకుండా టేకు చెట్ల నరికివేతపై సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం కామారెడ్డి డిప్యూటీ రేంజ్ అధికారి అనురంజనీరెడ్డి విచారణ చేపట్టి వసతి గృహం ఆవరణలో ఉన్న టేకు దుంగలను సీజ్ చేశారు. సోమవారం ఎల్లారెడ్డి రేంజ్ అధికారి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించగా, అటవీ శాఖ అనుమతి లేకుండా నరికిన నాలుగు టేకు చెట్లను నరికారని వాటికి సంబంధించిన 22 దుంగలను స్వాధీనం చేసుకుని హాస్టల్ వార్డెన్ శారదపై కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి ఓంకార్ తెలిపారు.

ఇల్లు దగ్ధం.. ఆరు లక్షల ఆస్తి నష్టం

జుక్కల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలం గుండురు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షాక్ ప్రమాదంతో ఇల్లు దగ్ధమై రూ.ఆరు లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని ఆర్ఐ రామారావు తెలిపారు. పూర్తి వివరాల మేరకు.. గుండూరు గ్రామానికి చెందిన సుమిత్ర వారి ఆడపడుచు త్వరలో పెళ్లి ఉండడంతో వెండి బంగారం ఆహారపు వస్తువులు కొంత నగదు ఇంట్లో నిల్వ ఉంచుకోవడంతో అనుకోకుండా విద్యుత్ ప్రమాదం జరిగి ఇల్లు దగ్ధమై నగదు వెండి బంగారం ఆర వస్తువులు ఇంట్లోనే కాలి బూడిదయాయని బాధితురాలు తెలిపారు. అర్ధరాత్రి గాఢనిద్రలో ఉన్నప్పుడు మంటలు సంభవించి ఎగిసిపడడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు పారిపోయి వచ్చామని బాధితులు తెలిపారు. సోమవారం రోజు జుక్కల్ ఆర్ఐ రామారావు సంఘటన స్థలానికి చేరుకొని దగ్ధమైన ఇల్లును పరిశీలించి గ్రామ పెద్దల సమక్షంలో పంచరామ నిర్వహించినట్టు అన్నారు. త్వరలో పెళ్లి ఉండడంతో నగదు డబ్బులు కాలిపోవడంతో బాధితులు దిగులు చెందారు. దాతలు ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

అదుపుతప్పి వాహనం బోల్తా

భిక్కనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలో 44వ జాతీయరహదారి బైపాస్‌పై సోమవారం తెల్లవారుజామున అదుపుతప్పి టాటాఏస్ వాహనం బోల్తాపడి 13మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గద్వాల జిల్లాకు చెందిన 13మంది టాటాఏస్ వాహనంలో బాసరలో జరిగిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని తిరిగి గద్వాల్ వెళ్తుండగా భిక్కనూరు వద్ద వామానం అదుపుతప్పి డివేడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నరేష్, అఖీల్, అపూర్వ, సాయిప్రకాష్, రమేష్, చరణ్‌లు గాయపడగా మరో ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని పోలీసులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంపై ఎలాంటి పిర్యాదు అందలేదని, ప్రసుత్తతం గాయపడ్డ వారు కామారెడ్డిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

భౌతికకాయం అప్పగింత

మద్నూర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జగద్గురు రామానందాచార్య, స్వామి నరేంద్ర చార్య మహరాజ్ ప్రేరణతో సోమవారం బిచ్కుంద మండలవాసి కామారెడ్డి జిల్లా సేవా సమితి యువ అధ్యక్షులైన చెల్లెళ్ల సాయిలు తండ్రి చెల్లెళ్ల గంగారం ఉదయం మరణించడం జరిగింది. కాగా, వీరి భౌతిక కాయాన్ని నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో బాడీ డొనేషన్ చేయడం జరిగింది. జగద్గురు నరేంద్ర చార్య మహరాజ్, సందేశం ప్రకారం మీరు జీవించండి, ఇతరులను జీవించడానికి సహాయపడండి అనే నినాదంతో సంస్థ ఆధ్వర్యంలో వివిధ రకాల సామాజిక కార్యాక్రమాలు నిర్వహిస్తున్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27 న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలవచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కామారెడ్డి, రాజంపేట మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలి కాలయాపన చేస్తున్నారని, హామీలు అమలుచేతకాక ప్రతిపక్షాలపై నోరుపారేసుకుంటున్నారని అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో మాజీ సీఎం కేసీఆర్ దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ ఈనెల 27 చేపట్టె రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి 3 వేల మంది కార్యకర్తలు తరలించాలని నిర్ణయించారు. ఇందులో కామారెడ్డి మండల అధ్యక్షుడు బలవంతరావు, సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్, వైస్ చైర్మన్ రమేష్, పార్టీ నాయకులు జూకంటి మోహన్‌రెడ్డి, గూడెం బాలరాజ్, కమలాకర్‌రావు, తదితరులున్నారు.

సదాశివనగర్: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రజతోత్సవ గోడప్రతులను సోమవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకుడు మర్కంటి బుచ్చయ్యనాగగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు,మాజీ ఎంపీటీసీ నర్సింలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలం పరిధిలోగల ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన వరంగల్ మీటింగ్ గురించి మాట్లాడడం జరిగింది. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి మండల మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, మాజీ రైతు విభాగం అధ్యక్షులు నారాయణరెడ్డి, పడిగేలా శ్రీనివాస్ గుప్తా, కాసర్ల రాజేందర్, బానూరి నర్సారెడ్డి, ల్యాగల మహిపాల్, గొల్లపల్లి రెడ్డి మల్లేష్, కే. నరేష్, శ్రీనివాస్, మండల మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, మల్లేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	140	170
వెన్‌కాబ్(కిలో)	130	160	190

